# పిచ్చుక గూళ్ళు

శ్రీలత

**అది పల్లె పట్నం కాని మధ్యస్థమైన ఊరు. గుబురు చెట్టుకు వేలాడే పిచ్చుకగూళ్ళలా గుంపులు గుంపులుగా ఇళ్ళు ఆక్రమించుకుని ఉంటాయి. ఇంతో అంతో ఉన్నవాళ్ళు పిల్లల్ని దగ్గరలోని పట్నంలో చదువులకు పంపేయగా లేని వాళ్ళ పిల్లలు కూలిపేరుతో వలసపోగా ఇంటికో ముసలి జంట కాపురముంటున్నారు.**

ప్రొద్దుటి నుండి ఎదురు చూస్తోంది కామాక్షి. ప్రొద్దుటేవిటీ రాత్రంతా నిద్దరలేదు. తెల్లవారుఝామున లేచి తన కొడుకుకు ఇష్టమనీ గారెలూ, పాయసం, పాలకోవాలు చేసేసి స్నానం చేసి దీపం పెట్టుకుని! ''పదేళ్ళ తరువాత మా అబ్బాయిని చూడబోతున్నాను. నీ దయకూ కృపకూ ధన్యవాదాలు'' అని దేవుడికి థ్యాంక్స్ కూడా చెప్పేసింది. చెప్తున్నప్పుడు గేటు చప్పుడయినా పరిగెత్తుకుంటూ వరండాలో బిచ్చగాడు నిలబడి ఉండడం గమనించి..

''వేళా పాళా లేదు వెధవలకు. ఇప్పుడు వండానో లేదో బయల్దేరాడు బిక్షానికి'' అని విసుక్కుంటూ లోపలికెళ్ళింది. రోజూ తప్పకుండా పిలిచి మరీ అన్నం పెట్టే కామాక్షి అలా ఎందుకు తిట్టిందో అర్థం కాక చిన్న మొహం వేసుకుని వెళ్ళిపోయాడు.

''వాడికి రోజూ ఈ వేళకే వేస్తావుకదే! అందుకే వచ్చుంటాడు'' అన్నాడు భర్త పరంధామయ్య.

''రోజూ ఈరోజూ ఒకటేనా?'' అంది భర్తని అంతమాత్రం తెలీదా అన్నట్టు చూసి.

''ఇదుగో ఈరోజు వీలుకాదు వెళ్ళిరా'' అని కసురుకుంది.

భర్త తనలో తాను నవ్వుకున్నాడు.

ప్రహరీ గోడమీద రెండు మూకుళ్ళు పెట్టి ఒక దాంట్లో నీళ్ళు ఒకదాంట్లోధాన్యం పెడుతుంది. రోజూ పిట్టలూ, పక్షులు వచ్చి తిని వెళ్ళడానికి. కాస్త సెంటిమెంట్లు ఎక్కువే కామాక్షికి. ఈరోజు మర్చిపోయిన






ట్లుంది అలవాటయిన పిచ్చుకలూ మరేవో పిట్టలూ వచ్చి ముక్కుతో పొడిచి ధాన్యము, కనీసం నీళ్ళయినా లేకపోవడం చూసి నీరసంగా వెళ్ళిపోతున్నాయి.

అది చూసి పరంధామయ్య ఆరోగ్యం బాగాలేకపోయినా నీరసంగా లేచి వచ్చి రోజూ తప్పకుండా వేసే భార్యని..

''కామాక్షీ! ఆ గోడమీద ధాన్యం వేయడం మర్చిపోయినట్లున్నావు చూడూ'' అన్నాడు.

''నేనేం మర్చిపోలేదు. చెయ్యి ఖాళీగా లేదు. అయినా ఒక్కరోజు వెయ్యకపోతే ఏం చచ్చిపోవులెండి'' అంది సున్నుండలు ముద్దలు కడుతూ.

కామాక్షి హడావిడికీ తీరికలేక పోవడానికీ కారణం తెలుసు కనుక మళ్ళీ నవ్వుకున్నారాయన.

ఆ కాలనీ పిల్లలందరూ వీళ్ళింటిముందు ఆడుకుంటూ వుంటారు. అది చూడడం మంచి కాలక్షేపం. ఇద్దరికీ వాళ్ళు మంచినీళ్ళు అడుగుతారనే మాటి మాటికీ ఇంట్లోకి వెళ్ళడం ఎందుకనీ వరండాలోనే కుండపెట్టి నీళ్ళుపోసి వాళ్ళడగ్గానే ఇస్తుంది కామాక్షి. సాయంత్రం సందడిగా ఉంటుంది. రోజులానే ఈరోజూ నిక్కరు పైకి లాక్కుంటూ ''నానమ్మా మంచినీళ్ళు కావాలి'' అన డిగాడు గుమ్మంలో కూర్చుని పాలకోవా చేస్తున్న కామాక్షిని. అబ్బ వెధవ గోల!

''ఈరోజు నీళ్ళకుండ పెట్టలేదు బాబూ తీరిక లేక'' అంది.

ఆ అబ్బాయి ఇంకాసేపు నిలుచున్నాడు ఇంట్లోంచి తెస్తుందేమోనని. పాలకోవా మీద నుండి కొంచెం కూడా కాన్సన్‌ట్రేషన్ తగ్గించలేదు కామాక్షి. ఆ అబ్బాయి చూసి చూసి వెళ్ళిపోయాడు. పరంధామయ్య కూడా ఏ ప్రయత్నమూ చెయ్యలా.. ఆ అబ్బాయి దాహం తీర్చడానికి.

సున్నుండలు కూడా చేశాక గబగబా పెరట్లోకి వెళ్ళి పూలబుట్ట నిండా కనకాంబరాలు కోసుకొచ్చి దారం తీసుకుని పరంధామయ్య ముందు బాసింపట్టు వేసుకుని మాల అల్లసాగింది. ఆ వేళ్ళ కదలికలు చూస్తుంటే చకచకా ఒకే లయలో నర్తిస్తున్న నాట్యబృందంలా వుంది. కదిలే చేతులతో పాటు గాజుల గలగల తాళం వేస్తున్నట్లనిపించింది అలాగే చూస్తున్న భర్తని..

''ఏవిటీ పెళ్ళయిన కొత్తలో చిత్రంగా చూసినట్టు ఆ చూపు'' అంది తలెత్తకుండానే.

''పెళ్ళయిన కొత్తలో ఏమిటీ ఈ నాటికీ పూలతోటలా రోజుకో కొత్తదనం సంతరించుకుంటావు'' అన్నాడు భార్య నుదుటిమీద చెమటకు అతుక్కున్న ముంగురులు చూస్తూ. పసుపు రాసుకున్న ఆమె మొహం వడలిన చంద్రబింబంలా ఉంది. ఆ జుట్టు అలసిన మబ్బురేకుల్లా ఉన్నాయి.

''అదుగో ఆ చూపే వద్దన్నానా!'' అంది గోముగా.

''సరేకాని ఈ రోజు పూలు ఎవరికీ పంపిస్తున్నావు'' అడిగాడు సందర్భం మార్చడానికి. అలా అంటుండగానే ''నానమ్మగారండీ, మరండీ.. మా ఇంట్లోనండీ ఈ రోజండీ, సత్యనారాయణ వ్రతమండీ. మిమ్మల్నండీ, తాతగారినండీ, భోజనానికండీ మా ఇంటికి రమ్మన్నారండీ. అలానే మీ తోటలో పూలండీ, పూజకు పంపించమన్నారండీ'' అంది చిట్టి ఎంతో మర్యాదగా చక్రాల్లాంటి కళ్ళు తిప్పుతూ.

''అదికాదే చిట్టీ! ఈరోజు మా అబ్బాయి వస్తాడు అమెరికానుంచి. అందుకే మేమెక్కడికీ రామని మీ ఇంట్లో చెప్పు. పూలు కూడా ఈ రోజు ఇవ్వడం కుదరదని చెప్పు'' అంది నిర్మొహమాటంగా, పుల్లవిరుపుగా.

''అదేవిటి కామూ! అబ్బాయి వచ్చేది సాయంత్రం కదా. ఈలోపు వాళ్ళింటి కెళ్ళి ప్రసాదం తీసుకుంటే వాళ్ళూ సంతోషిస్తారుగా. అయినా నీ కొడుకేవయినా చైనా పూర్వీకుడా భారతంలో అర్జునుడా బారెడు జడేసుకుని పూలు పెట్టుకోవడానికి? అవయినా పూజలకు పంపలేకపోయావూ?'' అన్నారు. ఆ అమ్మాయి అడిగిన దానికీ కామాక్షి చెప్పిన దానికీ ఆయన ఆలోచనలో పొత్తు కుదరక..

''పొరపాట్న వాళ్ళు ముందుగా వస్తే మనం బయటికెళ్తే చిన్నబుచ్చుకోరూ? వాడు పూలు పెట్టుకోకున్నా, గుమ్మాలకి తోరణంలా వేలాడదీస్తే వాడికి ఆహ్లాదంగా స్వాగతమివ్వవూ?'' అంది పైనుంచీ. ''ఎన్నేళ్ళొచ్చినా మీకు చిన్న చిన్న ఐడియాలు రావసలు'' అంది.

అవునులే అన్నట్టు తలూపాడు తప్పక.

''అయితే ఈరోజు డాక్టరుకు చూపించుకుంటానని అప్పాయింట్‌మెంట్ తెచ్చానుగా! అదికూడా కాన్సిలేనా?'' అన్నాడాయన కామాక్షి మోకాళ్ళనొప్పులు గుర్తొచ్చి.

''డాక్టరేవిటీ? అన్నీ కాన్సిలే! దేవుడు ప్రత్యక్షమైనా, రేపురా స్వామీ ఈ రోజుకు నా కొడుకును చూసుకోనీ అని దండం పెట్టి మరీ పంపిస్తాను'' అంది లేవలేని మోకాళ్ళను కూడదీసుకుని లోపలికి వెళ్తూ.

''జాగ్రత్త'' అన్నాడాయన పడిపోతుందేమోనని. ముదుసలులకు ఒకే ఒక్క కొడుకు. వాళ్ళ ఆదాయం తక్కువవడాన ఒక్కణ్ణీ బాగా చూసుకోవాలని. కాన్వెంటు చదువులతో కంప్యూటర్ చదువుల ఖర్చుకూడా పరిస్థితులు తంతున్నా సంబరపడుతూ కడుపులో కొడుకుని మోసినట్లే మోశారు.

''వండేప్పుడు ఎవరూ లేకపోయినా ఆరగించేసరికి అందరూ వచ్చారని'' గృహస్థుసంబరపడినట్లు, ఖరీదయిన భార్యా, మావగారూ, అత్తగారూ విదేశాల నుంచి వచ్చి మరీ తమ కొడుకుని ''ప్రసాదంగా'' పట్టుకెళ్తే ఆహా ఎంత పుణ్యం చేసుకున్నామో అనుకున్నారిద్దరూ.

వెళ్ళినవాడు వెళ్ళినప్పుడు చూడ్డమే వీళ్ళు. మళ్ళీ అతను తిరిగి చూళ్ళేదు. ప్రయాణ ఖర్చు భరించే శక్తిలేక వీళ్ళూవెళ్ళి చూడలేదు. అయినా అందరికీ బిడ్డ ఒళ్ళో ఉంటే, కామాక్షికి మాత్రం ఎప్పుడూ కళ్ళలోనూ, కలల్లోనూ ఉండేవాడు.

ఉదయాన్నే లేచి ''అబ్బాయి కల్లోకొచ్చాడండీ. నేను పెట్టినవన్నీ తిని మనవడ్ని చేతికందించాడు. చంటివెధవ ఎంత బాగున్నాడో. అన్నీ మీ పోలికలే'' అని రోజూ ఉదయాన్నే సుప్రభాతం పాడేది పరంధామయ్య చెవుల్లో.

రోజూ కలలో కొడుకును చూస్తున్న కామాక్షిని చూసి ఈసు కలిగేది పరంధామయ్యకు. కడుపులోని కొడుకు కదలికలు బయటనుండీ తడిమి చూసినట్టు కలల్లోని కొడుకుని కథగా చూసేవాడాయన. పన్నెండేళ్ళ తర్వాత ఈరోజు రాబోయే తమ సంతతి కోసం ఎదురుచూస్తున్నారు చకోరాల్లా.

''కోడలికీ, మనవడికీ ఇక్కడ పల్లెటూళ్ళో ఏసి రూములేవనీ, ఫ్రూట్ సలాడ్లు అమ్మకు చెయ్యడం రాదనీ వాళ్ళ ఆరోగ్యం చెడిపోతుందనీ అందుకే తను వచ్చి ''చల్లని రాత్రిపూట'' మీతో గడిపి ఎండ వచ్చే సరికి వెళ్ళిపోతానని ఫోన్ చేశాడు కొడుకు.

ఆ మాత్రం దానికే కామాక్షి ఉలికిపాటంతా! రాబోయే కొడుకు కోసం రెండు రోజుల నుండి ఇంటిబూజు దులపడంతో మొదలుపెట్టి పెరుగులో నంజుకోవడానికి నిమ్మకాయ పచ్చడివరకూ రెడీ చేసి పెట్టింది! ఎవరొచ్చినా సరే తన టైము వేస్ట్

చేస్తున్నట్టు కసిరి పంపేస్తోంది.

సూర్యుణ్ణి మూసేస్తూ సాయంత్రం అయ్యింది. చంద్రుడి వెలిగిస్తూ రాత్రి వచ్చింది. ఆకాశమంతా ఆనందపు చినుకులు జల్లినట్టు చుక్కలు మెరుస్తున్నాయి.

సాయంత్రం నుంచీ గుమ్మానికి ఆనుకుని శబరి లాగాకూర్చున్నకామాక్షి అర్ధరాత్రయినా లేవలేదు. బహుశా పన్నెండున్నరకనుకుంటా పక్కింటి చిట్టి వచ్చి.. ''తాతయ్యా నీకు ఫోన్ వచ్చింది'' అని చెప్తే మెల్లగా ఊతకర్ర అందించి గేటు వరకూ తోడెళ్ళి పంపించింది భర్తను కామాక్షి. కొడుకు ఎక్కడో దగ్గర్లోకి వచ్చేసుంటాడు. వచ్చేస్తున్నానని ఫోన్ చేసి వుంటాడు. అని గబగబా బూడిద గుమ్మడికాయ మీద హారతి కర్పూరం అద్ది స్తాంబాళంలో ఎర్ర నీళ్ళు కలిపింది దొరబాబంటి తన కొడుకుకి దిష్టి తీయాలని.

ఫోన్ మాట్లాడి వస్తున్న పరంధామయ్యగారికి గేటులోకే ఎదురొచ్చింది విషయమేంటో తెలుసుకోడానికి.

''అబ్బాయి ఫోన్ చేశాడు! హైదరాబాద్‌లో ఫ్రెండ్స్‌నీ, అత్తగారి బంధువులనూ కలిసే సరికే రోజులు సరిపోయాయని టైము కుదరక రాలేనని రేపు ఫ్లైటుకు వెళ్లిపోతున్నానని, అమ్మను అడిగానని చెప్పమన్నాడు'' అన్నాడు చివరి వాక్యం తను జతచేసి.

వెన్నెట్లో పరంధామయ్య కళ్ళలోకి చూస్తూ అలాగే నిలబడిపోయింది కామాక్షి. చిన్నగా పెదవులు విచ్చి, పరంధామయ్యకేదో అనుమానం వచ్చి...

''కామాక్షి..కామాక్షీ.. కామూ'' అని భుజాలు కదిపేసరికి కిందకు జారిపోయింది మెల్లగా. ఆ జారడంలో పంధామయ్య ఊతకర్రకు తగిలి అదీ దూరంగా పడిపోయింది. దాంతో ఆయన కూలిపోయారు. ఊతకర్ర మాత్రం అలాగే చూస్తూ ఉండిపోయింది అభావంగా.

ముందుగా పరంధామయ్య లేచి కామాక్షి మొహం మీద నీళ్ళుచల్లి లేపి ఆసరాగా నిలబడి నడిపించుకెళ్ళాడు. ఆ రాత్రంగా కామాక్షి పరంధామయ్య చెయ్యి వదలకుండా పట్టుకునే వుంది.

ఉదయం లేచేందుకు పరంధామయ్యకు భయం వేసింది. రాత్రి కళ్ళు తిరిగి పడిపోయిన కామాక్షి ఈ రోజంతా కొడుకు రాలేదని ఏడుస్తుందేమో. కామాక్షి నవ్వేకానీ ఏడుపుచూడలేడు. అందులోనూ బీపీ, షుగరూ ఉన్నాయి. తనుగానీ మంచం పడితే సేవలెలా చేయాలో కూడా తెలియదు. ఎప్పుడు తను చేయడమే గానీ, ఎవర్తోనూ చేయించుకుని ఎరగదు. భగవంతుడా కామాక్షి కళకళలాడుతూ తిరగనీ తను బతికున్నంత వరకూ అనుకున్నాడు.

***

''ఇదుగో గోవిందూ! ఇవన్నీ నువ్వొక్కడివే తినక, పెళ్ళాం పిల్లలకు కూడా తీస్కెళ్ళు'' కామాక్షి గొంతు ఆర్డరు వేసింది.

''అట్టాగే అమ్మా'' వాడి గొంతులో సంతోషం చిందులు వేసింది.

పిట్టలకు ధాన్యం వేసినట్లుంది ఎక్కడెక్కడి పిట్టలూ వచ్చి కువకువలాడుతూ తింటున్నాయి. కొన్ని కామాక్షి భుజాల మీద వాలాయి.

''ఇదుగో చిట్టీ పూలు కోసి పెట్టాను.. తీస్కెళ్ళి మీ అమ్మ పూజకు ఇవ్వు'' పనయ్యాక వస్తుందట అని చెప్పు''

''అలాగే నాన్నమ్మా!'' చిట్టి గొంతు.

''ఏవిట్రా మంచినీళ్ళయినా తాగకుండా ప్రొద్దుటే ఆటలు? నుదురు చెమట పట్టిపోయింది! ఈ కాసిన్ని సున్నుండలూ తిని చల్లటి నీళ్ళు తాగి ఆడుకోండి'' అంటోంది బిలబిలలాడుతూ కామాక్షి చుట్టూ పిల్లలు చేరిన సందడి వినిపిస్తోంది.

అంతా వెళ్ళాక పరంధామయ్య గదిలోకి వచ్చింది కామాక్షి.

''ఏవిటీ లోకమంతా లేచి గడబిడ పడుతూంటే శ్రీమన్నారాయణుడులా చిదంబరంగా పడుకున్నారూ? లేవండీ?'' అంది దుప్పటి తీస్తూ.

''అలాగే కామాక్షి'' అంటూ చెయ్యి పట్టుకుని కూర్చోబెట్టి ఒళ్ళో తల పెట్టుకున్నాడు.

కామాక్షి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ఇంత మంచి కొడుకు ఒళ్ళో ఉంటే నేను ఎక్కడో ఎందుకు వెతుక్కున్నానో అనుకుంది.

''ఏవండీ నేను నిన్న తప్పు చేశానా?'' అంది అలాగే వంగి భర్తచెవిలో!

''అవును! ఒక్కకొడుకు కోసం ఒక్క అమ్మా అనే పిలుపుకోసం ఇంతమందిని బాధపెట్టావు! ఇంత మందికి 'అమ్మ'ను దూరం చేశావు'' అన్నాడాయన.

''ఏవనుకోకండీ ఇంకోసారి చేయనిలా'' అంది కళ్ళను ముంచేసిన నీళ్ళు తుడుచుకుంటూ.

కుయ్ కుయ్‌మంటున్న కుక్కపిల్లను ఒళ్ళోకి ఎత్తుకుని పనిలో పడిపోయింది.

ముడతలు పడ్డ చెక్కిళ్ళు మీదనుంచీ జారి పరంధామయ్య కనుకొనుకుల్లో పడి కిందకు జారాయి. ★

## రోల్‌మోడలా మజాకా!

యాభయ్యవ ర్యాంకు నుంచి ముఖ్ఖల దగ్గరకు వచ్చిన సానియా మీర్జా.. టెన్నిస్ ప్రేమికులకే కాదండోయ్, జ్యూయలరీ ప్రేమికులకూ రోల్‌మోడలే అవుతోంది. సానియా ముక్కుకు ఎడమ వైపు ధరించే ముక్కెర ఇప్పుడు పెద్దసెన్సేషన్ అయింది. మధ్యప్రదేశ్‌లోని కొన్ని తెగల వారు దీన్ని ప్రత్యేకంగా ధరిస్తున్నారు. ఇక ఉత్తరాదిన కూడా ఈ ముక్కెర ఇప్పుడు బాగా ఫేమస్ అయింది. ఇందుక్కారణం అది ఒక సాంప్రదాయ ఆభరణం కూడానట. అయితే మరి కొందరు మాత్రం సానియా వాడే ముక్కెర డిజైన్‌లనే అనుకరించడం మరో విశేషం. ఇప్పుడు సానియా చాలామందికి రోల్‌మోడల్!

